క్లుప్తంగా

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: పోరంకిలో విద్యార్థి అదృశ్యంపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి ప్రభునగర్‌కు చెందిన ముద్దాడ సీతామహాలక్ష్మి భర్త అప్పలనాయుడు దంపతులు పోరంకి ప్రభునగర్‌లో నివాసం ఉంటున్నారు. సీతామహాలక్ష్మి పోరంకిలో ప్రైవేటు ఆస్పత్రిలో హెల్పర్‌గా పనిచేస్తుండగా ఆమె భర్త తాపీ పనులు చేస్తాడు. వీరి కుమారుడు ముద్దాడ సింహాచలం (15) స్థానికంగా ఉన్న ఒక ప్రైవేటు పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. అతను పాఠశాలకు వెళ్లకపోవటంతో తల్లి మందలించింది. దీంతో సింహాచలం గత నెల 27వ తేదీన పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుమారుడి కోసం అప్పటినుంచి తల్లిదండ్రులు అనేక ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ తెలియక పోవటంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వాహనాల చోరీపై కేసులు నమోదు

పెనమలూరు: మండల పరిధిలో పలు ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా ద్విచక్ర వాహనాల వరుస చోరీలపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు శివాలయం ప్రాంతానికి చెందిన పులి తరుణ్ సిద్ధార్థ కాలేజీ సమీపంలో ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుంటారు. ఆయన తన బైక్‌పై ఆఫీసుకు వచ్చి బైక్‌ను బయట పార్క్ చేశాడు. పనులు ముగించుకుని వచ్చి చూడగా బైక్ కనపడలేదు. గుర్తు తెలియని వ్యక్తులు బైక్ చోరీ చేశారు. మరో ఘటనలో యనమలకుదురు ఇందిరానగర్ 1లో ఉంటున్న లారీ డ్రైవర్ పామర్తి వెంకటస్వామి తన మిత్రుడు రమేష్‌కు చెందిన బైక్ తీసుకుని అదే గ్రామంలో డొంక రోడ్డులో ఉంటున్న వదిన బెజవాడ రాణి ఇంటికి వచ్చి బైక్ ఇంటి ముందు ఉంచాడు. ఆ తరువాత అతను బయటకు వచ్చి చూడగా బైక్ చోరీకి గురైంది. కానూరుకు చెందిన ఆళ్ల దుర్గారావు కొత్త ఆటోనగర్ వద్ద ఉన్న నారాయణ కాలేజీ సమీపంలో బైక్ ఉంచి పని చూసుకుని వచ్చి చూడగా అతని బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు.ఈ ఘటనలపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసులు నమోదు చేశారు.

యువతిని మోసగించిన పలువురిపై కేసు

పెనమలూరు: ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన యువకుడితో పాటు అతని కుటుంబ సభ్యులపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు మురళీనగర్‌కు చెందిన యువతి 2021లో ఇంటర్ చదువుతున్న సమయంలో అదే గ్రామానికి చెందిన కాట్రగడ్డ దినేష్‌కుమార్ తనను పెళ్లి చేసుకుంటానని ఒప్పుకోకపోతే చనిపోతానని బెదిరించాడు. దీంతో యువతి అతని మాటలు నమ్మింది. అతనికి శారీరకంగా దగ్గరైంది. దినేష్‌కుమార్ తన తల్లిదండ్రులకు చెప్పి ఒప్పించి తన స్వగ్రామం తరకటూరులో ఆమెను కొంతకాలం ఉంచాడు. యువతి తల్లిదండ్రులు కేసు పెట్టగా త్వరలో పెళ్లి చేసుకుంటానని ఆమెను తిరిగి కానూరులో ఆమె ఇంటికి పంపాడు.కొద్ది కాలంగా దినేష్‌కుమార్ కనిపించకపోవటంతో ఈ నెల 5వ తేదీన యువతి అతని ఇంటికి వెళ్లి అతని తల్లిదండ్రులను ప్రశ్నించగా వారు అవమానకరంగా మాట్లాడారు. జరిగిన మోసంపై బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

ఎస్సీ కాలనీకి ఉచితంగా ఫ్రీజర్ బాక్స్ అందజేత



హనుమాన్‌జంక్షన్ రూరల్: రైతులకు రుణాలు అందించటంతో పాటుగా ఇతోధికంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తిప్పనగుంట పీఏసీఎస్ సేవలు అభినందనీయమని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అన్నారు. బాపులపాడు మండలం తిప్పనగుంటలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో రూ.90 వేలు విలువ చేసే మార్చురీ ఫ్రీజర్ బాక్స్‌ను ఎస్సీ కాలనీ వాసులకు గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ చేతుల మీదగా ఉచితంగా అందజేశారు. గ్రామంలో ఎవరైనా పేదలు చనిపోయినప్పుడు ఉచితంగా ఫ్రీజర్ బాక్స్ అందించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ మూల్పూరు ప్రభుకాంత్ చెప్పారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ పాల్గొన్నారు.

పంట నష్టం నమోదు ప్రారంభం

ఉంగుటూరు: ఇటీవల మిచాంగ్ తుఫాన్‌కు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందజేసేందుకు మండలంలో వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం పంట నష్టం నమోదు ప్రక్రియ ప్రారంభించారు. మండల వ్యాప్తంగా ఉన్న 16 ఆర్‌బీకేల్లోని సిబ్బంది, వీఏఏలు వరి పంట నష్టం అంచనాలు వేసేందుకు పొలాల్లో పర్యటిస్తున్నారు. తొలి రోజు మండలంలో 50 శాతం వరి పొలాల్లో పంట నష్టం అంచనాలు వేయగా 33శాతం కన్నా ఎక్కువ 7వేల ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు గుర్తించారని ఏవో హరీష్‌కుమార్ తెలిపారు. పంట నష్టం నమోదు ప్రక్రియ కొనసాగుతోందని ఇంకా ఎవరైనా రైతులు ఉంటే ఆర్‌బీకేలో తెలియజేయాలని సూచించారు. హెక్టారుకు రూ.17వేలు నష్ట పరిహారం ప్రభుత్వం అందజేయనున్నట్లు తెలిపారు.

పంట నష్టం నమోదు చేపట్టిన అధికారులు

- హెక్టారుకు రూ.17 వేలు పరిహారం.
- ఉద్యాన వన పంటలకు కూడా..



చోడవరంలో నేల వాలిన వరి పంట(ఫైల్)

పెనమలూరు: తుపాను కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలిచింది. పంట నష్టం వివరాలు నమోదు చేయాలని అధికారులను ఆదేశించింది. దీంతో మండల పరిధిలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పంట నష్టం నమోదుకు రంగంలోకి దిగారు. ఇటీవల వచ్చిన తుపాను కారణంగా మండల పరిధిలో వరి పంట దాదాపుగా 3,950 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ప్రాథమికంగా అంచనా వేశారు. వరి కోతల సమంలో తుపాను, ఈదురుగాలులతో వర్షం కురవటంతో పంట నేలవాలటమే కాకుండా వర్షం నీటిలో పంట పూర్తిగా తడిచిపోయింది. పనలపై ఉన్న పంట పూర్తిగా వర్షం నీటిలో నానిపోయింది. పంట నష్టపోవటంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ సమయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు అండగా నిలిచింది.

పంట నష్టం వివరాలు నమోదు...

మండల పరిధిలో ఉన్న పది గ్రామాల్లో పంట నష్టం నమోదు సోమవారం నుంచి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ గైడ్‌లైన్స్ ప్రకారం కోయని వరి పంట 33 శాతం కన్నా ఎక్కువగా నష్టం జరిగితే అధికారులు పంట నష్టం నమోదు చేస్తారు. హెక్టారుకు రూ.17 వేల పంట నష్ట పరిహారం ప్రభుత్వం ఇస్తుంది. గతంలో హెక్టారుకు రూ.15 వేలు పరిహారం ఉండగా ఇప్పుడు నష్టపరిహారం ప్రభుత్వం పెంచింది. పంట నష్టం నమోదు ఈ నెల 18వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.



గోసాలలో పడిపోయిన అరటి తోట(ఫైల్)

ఉద్యాన వన పంటలు కూడా...

మండల పరిధిలో తుపాను కారణంగా నష్టపోయిన ఉద్యానవన పంటల నష్టం కూడా నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మండల పరిధిలో అరటి పంట 56 హెక్టార్లు, ఆకు తోటలు 7.6 హెక్టార్లు, కూరగాయలు 2 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. అరటికి హెక్టారుకు రూ.25 వేలు, కూరగాయలకు హెక్టారుకు రూ.17 వేలు, ఆకు తోటలకు సెంటుకు రూ.300 చొప్పున గరిష్టంగా 100 సెంట్లకు రూ.30 వేలు పరిహారం ఇస్తారు.

వివరాలు తెలుపండి..

పంట నష్టం వివరాలు రైతులు అధికారులకు తెలపాలని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎన్యూమరేషన్ చేస్తామని, రైతులు సహకరించాలని కోరారు. సోషల్ ఆడిట్ సమయంలో రైతులు వివరాలు సరిచూసుకోవాలని అన్నారు. వరి రైతులకు హెక్టారుకు రూ.17 వేల పరిహారం అందుతుందని ఆమె తెలిపారు.

19 నుంచి సోషల్ ఆడిట్...

పంట నష్టం వివరాల నమోదు 18వ తేదీ పూర్తి చేసిన తరువాత 19వ తేదీ నుంచి సోషల్ ఆడిట్ నిర్వహిస్తారు. ఈ నెల 19వ తేదీ నుంచి 22 వరకు సోషల్ ఆడిట్ ఉంటుంది. పంట నష్టం వివరాలు, రైతుల పేర్లు అధికారులు ప్రకటిస్తారు. అభ్యంతరాలు ఉన్న రైతులు అధికారులకు తెలియజేయాలి.

ముంపు సమస్య పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



దావులూరు వద్ద గల మురుగుకోడు కట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కంకిపాడు: పొలాల ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి తెలిపారు. దావులూరు వద్ద గల మురుగుకోడు డ్రెయిన్‌ను సోమవారం ఆయన రైతులుతో కలిసి పరిశీలించారు. మురుగు కోడు కట్ట వెంబడి నడుస్తూ, తుపాను కారణంగా ముంపు బారిన పడ్డ పంట పొలాలను పరిశీలించారు. బాధిత రైతాంగంతో మాట్లాడి పంట నష్టం వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి నుంచి దావులూరు పంట పొలాల మీదుగా కుందేరు వరకూ ఉన్న మురుగుకోడు పూడికతీత తక్షణమే మొదలు పెట్టాలన్నారు. అత్యవసర పనుల కింద పూడికతీత పూర్తి చేసి పొలాల్లో మురుగు నీరు మురుగుకోడులోకి వచ్చి చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు కష్టమొచ్చినప్పుడు అంతా అండగా నిలవాలని సూచించారు. పూడికతీత పనులను సమర్థంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చాట్ల విజయ్‌బాబు మండలంలో తుపాను ప్రభావంతో ఏర్పడిన పంట నష్టం వివరాలను ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు మసిముక్కు సాంబశివరావు, బొమ్మారెడ్డి వాసు, ప్రభాకర్‌రెడ్డి, ఇరిగేషన్, డ్రెయినేజీ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం

ఉయ్యూరు: మిచాంగ్ తుపానుతో నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని పెద ఓగిరాల గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో రూ.42 లక్షల అంచనా వ్యయంతో ఆధునికీకరించిన నాడు–నేడు పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం తుపాను ప్రభావంతో నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం అంచనాలు తెలుసుకున్నారు. డ్రెయిన్ల పూడిక పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పొలాల్లో మురుగు పోయేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులకు ఫోన్ చేసి సూచించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులను ఆదుకోవటంలో ఎప్పుడూ ముందే ఉంటారన్నారు. పంట నష్టం సర్వే జరుగుతోందని, తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రైతుల విషయంలో ఉదారంగా వ్యవహరించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ త్రిపురం లక్ష్మి, ఎంపీటీసీ గుంటక నాగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బొమ్ము లక్ష్మారెడ్డి, ఎంఈఓ సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు త్రిపురం చందు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర పోటీలకు క్రీడా కిట్లు పంపిణీ



క్రీడా కిట్లను అందజేస్తున్న ఎంపీడీఓ, అధికారులు

గన్నవరం: ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర పోటీలకు క్రీడా కిట్ల పంపిణీ ప్రారంభమైంది. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ ఈ.సత్యకుమార్ చేతుల మీదుగా సచివాలయ సిబ్బందికి కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ తొలుత గ్రామ సచివాలయ స్థాయిలో ఆడుదాం ఆంధ్ర పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ డబుల్స్ విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. పోటీలకు అవసరమైన క్రీడా సామగ్రిని కూడా ప్రభుత్వమే అందజేసినట్లు చెప్పారు. పోటీలను విజయవంతం చేసేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన ప్రతిజక్కరు సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈఓపీఆర్డీ పి.వెంకటేశ్వరమ్మ, గన్నవరం ఈవో సీహెచ్. అనిల్‌కుమార్, నియోజకవర్గ క్రీడా సమన్వయకర్త దనియాల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవన రైతులు సస్యరక్షణ చేపట్టాలి



అరటి తోటను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారి చందుజోసెఫ్

పెనమలూరు: తుపాను కారణంగా ఉద్యానవన రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి చందుజోసెఫ్ అన్నారు. ఆయన సోమవారం మండలంలోని యనమలకుదురు, తాడిగడప, చోడవరం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. తుపాను కారణంగా పొలాల్లో నిలిచిన నీరు వెంటనే బయటకు తోడాలన్నారు. కూరగాయ పంటలకు ఆకు మచ్చ, కాయపుచ్చు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్బెండైజింగ్ లేదా ప్రోపీకొనజాల్ రెండు గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పడి విరిగిన అరటి చెట్లను చిన్నచిన్న ముక్కలుగా చేసి దున్ని సింగిల్ సూపర్ ఫాస్ట్ 50 కేజీలు చల్లితే రాబోయే పంటలకు బలం చేకూరుతుందన్నారు. పసుపు తోటల్లో దుంప కుళ్లు రాకుండా చూసుకోవాలని తెలిపారు. తోటలు, కూరగాయల పంటల నష్టంపై ఎన్యూమరేషన్ చేపడుతున్నామని, ఈ నెల 21 నాటికి తుది జాబితా సిద్ధం చేస్తామని వివరించారు.

ఆ కథనం పూర్తి అవాస్తవం

నిగ్గు తేల్చిన అధికారులు

కంకిపాడు: రైతుకు దగా–దళారీ ధగధగ శీర్షికన ఈనాడు పత్రికలో ప్రచురితమైన కథనం పూర్తి అవాస్తవమని అధికారులు తేల్చారు. జిల్లాలో జరుగుతున్న స్పష్టం చేశారు. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో తహసీల్దారు పీఎస్‌వీ ప్రసాద్, సీనియర్ ఇన్‌స్పెక్టర్, గ్రామ సర్పంచి ఇందిర సమక్షంలో ఈడుపుగల్లు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం శాఖాపరంగా విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన కొవ్వాలి కొండలరావు ఐదు ఎకరాల వ్యవసాయ భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. ఈ నెల 1వ తేదీన కోత పూర్తిచేసి ఆర్బీకే ద్వారా తేమ శాతం పరిశీలించి 309 గోనె సంచుల్లో ధాన్యం నింపి గంగూరులోని వెంకటాద్రి ఆయిల్ మిల్స్‌కు ధాన్యం తరలించారు. కొండలరావు ఎవరి వద్ద నూటికి రెండు రూపాయల వడ్డీకి అప్పు తీసుకోలేదని, ధాన్యం కొనుగోలులో మధ్యవర్తులను ఆశ్రయించలేదని అధికారుల విచారణలో తేలింది. ఈ మేరకు కౌలు రైతు కొండలరావు లిఖిత పూర్వకంగా ఈనాడులో వచ్చిన కథనం పూర్తి అవాస్తవమని అంగీకరిస్తూ స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఈ నివేదికను తహసీల్దారు ప్రసాద్ జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ డి.రాజుకు నివేదించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

రామవరప్పాడు: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారిని వెనుక నుంచి కారు ఢీ కొట్టడంతో ఇద్దరు గాయాలపాలైన ఘటన సోమవారం గూడవల్లి జాతీయ రహదారిపై జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. విజయవాడ వన్‌టౌన్‌లో వస్త్రలత కాంప్లెక్స్‌లోని దుస్తుల దుకాణంలో పి.నాగరాజు (25), షేక్ షహనాజ్ (25) పని చేస్తున్నారు. ద్విచక్రవాహనంపై ఇరువురు ద్వారకా తిరుమల దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో గూడవల్లి హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్దకు వచ్చేసరికి వెనక నుంచి కారు వీరిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నాగరాజు, షహనాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. షహనాజ్ తలకు తీవ్ర గాయమవడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. తోటి ప్రయాణికులు 108కు సమాచారం ఇవ్వడంతో ఇరువురిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బస్సును ఢీకొట్టిన లారీ స్తంభించిన ట్రాఫిక్

గన్నవరం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద లారీ–బస్సు ఢీకొన్న ప్రమాదంతో ట్రాఫిక్ స్తంభించిన సంఘటన సోమవారం జరిగింది. 252 వ నంబరు సిటీ బస్సు ఉదయం హనుమాన్‌జంక్షన్ నుంచి గన్నవరం వైపు బయలుదేరింది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి వచ్చిన లారీ బస్సు వెనుక వైపు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. అయితే లారీ డ్రైవర్‌కు ఫిట్స్ వలే రావడంతో స్టీరింగ్‌పై వాలిపోయాడు. స్థానికులు సేవలందించడంతో కొద్దిసేపటికి కోలుకున్నాడు. ఈ ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు అక్కడికి చేరుకుని ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

దివ్యాంగ పిల్లలను ఆదరించాలి

పెనమలూరు: దివ్యాంగ పిల్లలపై జాలి చూపటం కన్నా ప్రేమ చూపి వారిని ఆదరించాలని గుడివాడ డీవైఈఓ పద్మారాణి అన్నారు. పెనమలూరు మండల పరిషత్ సెంట్రల్ స్కూల్ భవిత కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఆమె ప్రసంగించారు. దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం అనేక రకాలుగా సాయం అందిస్తోందన్నారు. వినికిడి, దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు ట్యాబ్‌లు ఇస్తోందన్నారు. పది చదివే విద్యార్థులకు పాస్ మార్కులు కూడా తగ్గించిందని అన్నారు. విద్యార్థులకు పరికరాలు ఉచితంగా ఇచ్చి ఫిజియోథెరపీ చేయిస్తోందని చెప్పారు. ఏఎస్ఓ ఎస్.రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే భవిత కేంద్రాలకు విద్యార్థులను తీసుకువచ్చి వారిలో ఆత్మస్థైర్యం పెంచుతోందని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు బి.శేషగిరిరావు, కనకమహాలక్ష్మి, హెచ్ఎం బి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు(ఐఈపీఆర్) ఎం.కోటేశ్వరి, ఎం.రాములు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంధన వనరులు సద్వినియోగం చేసుకోవాలి

పెనమలూరు: పర్యావరణాన్ని పరిరక్షించుకునే విధంగా ఇంధన వనరులను సద్వినియోగం చేసుకోవాలని ఐఐటీ చెన్నై ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో నోవెల్ మెటీరియల్స్, డివైజెస్, అప్లికేషన్స్‌పై వారం రోజుల పాటు అధ్యాపకుల అభివృద్ధికి సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులో పాల్గొన్న ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో ఇంధన వనరులు పుష్కలంగా ఉన్నాయన్నారు. భవిష్యత్తులో కాలుష్యం లేని గాలి గ్రీన్ ఎనర్జీ ద్వారానే చూడగలుగుతామన్నారు. రానున్న కాలంలో విద్యుత్ వాహనాల వినియోగం బాగా పెరుగుతుందన్నారు. సౌరశక్తి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.విజయసాయి, డీన్ డాక్టర్ ఎంవీఎస్ రాజు, ప్రొఫెసర్ శ్రీనివాస ప్రసాద్, కోఆర్డినేటర్ డాక్టర్ కె.రమణయ్య, వివిధ కాలేజీల నుంచి అధ్యాపకులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తిక పూజలు



ఆలయంలో శివలింగాకారంలో వెలిగించిన దీపాలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలోని ఉప ఆలయమైన శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లను రకరకాల పుష్పాలతో అలంకరించారు. ఉదయం నుంచి రామవరప్పాడుతో పాటు పలు గ్రామాల్లోని భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి లోకేశ్వరి, చైర్మన్ బోయిన భాను ప్రదీప్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర దీపాలంకరణ

కార్తికమాసం ఆఖరి సోమవారం సందర్భంగా ఆలయంలో రాత్రి భక్తిశ్రద్ధలతో సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. శివలింగాకారంలో దీపాలను అందంగా అలంకరించారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు ఈ దీపాలంకరణ సేవలో విశేషంగా పాల్గొన్నారు.

యనమలకుదురులో శాంతికల్యాణం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో కార్తిక మాసం చివరి సోమవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాసశివరాత్రి సందర్భంగా స్వామివారికి అభిషేకం చేసి విశేషంగా అలంకరించారు. అనంతరం స్వామివార్లను పల్లకీలో ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. శాంతి కల్యాణం ఘనంగా చేశారు.


కనులపండువగా లక్ష దీపాలంకరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం పెరికీడులోని ముక్తికాంత సమేత ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకుని సోమవారం రాత్రి దశ సహస్ర దీపాలంకరణ కనులపండువగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో శివలింగాకృతిలో లక్ష దీపాలను మహిళలు అలంకరించారు. దీపక్ నెక్స్ జెన్ ఫీడ్స్ ఫ్యాక్టరీ సహకారంతో ఏర్పాటు చేసిన దశ సహస్ర దీపాలంకరణకు అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ని కొండేశ్వర స్వామి దేవస్థానంలోనూ లక్ష దీపాలతో శివలింగాకృతిలో చేసిన అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది.



వీరవల్లిలో...

చినకంచిలో కార్తిక సోమవారం పూజలు



చినకంచిలో...

నున్న(విజయవాడరూరల్): కార్తిక మాసం ఆఖరి సోమవారం, మాస శివరాత్రి సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ప్రసిద్ధ దేవస్థానం చినకంచిలో తెల్లవారు జాము నుంచే కార్తిక మాసం పూజలను భక్తులు నిర్వహించారు. శివకల్యాణం, చండీహోమం, అభిషేకాలను నిర్వహించారు. సాయంత్రం ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర లింగార్చన, దీపోత్సవం కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. శ్రీరామలింగేశ్వరస్వామి, శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి, శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానాల్లో భక్తులు కార్తికమాస పూజలు చేశారు. పాతపాడు గ్రామంలో శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో కార్తిక మాసం పూజలు నిర్వహించారు. పి.నైనవరం గ్రామంలో కోదండ రామాలయం వద్ద భక్తులు కార్తిక మాసం పూజలను నిర్వహించారు. చివరి సోమవారం కావడంతో భక్తులు దీపోత్సవాలను నిర్వహించారు.

పాదయాత్ర బృందానికి స్వాగతం

రామవరప్పాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ విశాఖపట్నం నుంచి తిరుపతికి పాదయాత్రగా బయలు దేరిన ప్రసాద్ బృందానికి సోమవారం నిడమానూరులో ఘన స్వాగతం లభించింది. గ్రామ సర్పంచ్ శీలం రంగారావు ఆధ్వర్యంలో ప్రసాద్ బృందానికి స్వాగతం పలికి ఆదివారం రాత్రి గ్రామంలో బస ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం ఈ యాత్ర కాలినడకన బయలు దేరింది.

సంక్షిప్త వార్తలు

ప్రత్యేక ఉపాధ్యాయులు నైపుణ్యాలను పెంచుకోవాలి

గన్నవరం: ప్రత్యేక ఉపాధ్యాయులు నిరంతరం నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వంకాయలపాటి వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ డీఈడీ ప్రత్యేక విద్య కళాశాలలో సోమవారం భారతీయ పునరావాస మండలి(ఆర్‌సీఐ) అనుమతితో జరుగుతున్న ''వర్క్ అండ్ ఎంప్లాయిమెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబుల్డ్'' అనే అంశంపై రాష్ట్ర స్థాయి సీఆర్ఈ కార్యక్రమం నిర్వహించారు. డీపీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను, కళాశాల చైర్మన్ సంకాబత్తుల వెంకట్ అధ్యక్షతన కార్యదర్శి రజిత, ఎన్టీఆర్ జిల్లా సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలిటీ ఆఫీసర్ సదారత్ బేగ్, మాజీ వైస్ ఎంపీపీ ఆర్నేపల్లి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం

గన్నవరంరూరల్: మండలంలో మిచాంగ్ తుఫాన్ వల్ల పంట నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం నష్ట పరిహారం అందజేస్తుందని మండల వ్యవసాయ అధికారి ఎస్ఎల్ తేజశ్వి చెప్పారు. హెక్టారుకు రూ.17వేలు పరిహారంగా అందజేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీనికి రైతు భరోసా కేంద్రాల్లో రైతులు పొలం పాస్ పుస్తకం లేదా ఈ క్రాప్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ పుస్తకం జిరాక్స్ కాపీలు అందజేయాల్సి ఉందన్నారు. ఈ క్రాప్ నమోదు చేసుకున్న పంటలకు నష్ట పరిహారం వర్తిస్తుందని చెప్పారు. మండలంలో వరి, వేరుశనగ, పత్తి పంటలకు నష్టపరిహారం అందుతుందన్నారు. ఈ నెల 18వ తేదీ వరకూ నష్టపోయిన పంటలను నమోదు చేస్తామని, 22వ తేదీ వరకూ సోషల్ ఆడిట్ ద్వారా ఆర్బీకేలలో లిస్టులను ప్రదర్శిస్తామన్నారు. 26వ తేదీన ఫైనల్ లిస్టును కలెక్టర్‌కు పంపుతామన్నారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: దేశంలోనే అత్యధిక పాల సేకరణ ధరను చెల్లించటంతో పాటుగా ఏటా మూడు దఫాలుగా పాడి రైతులకు బోనస్ అందిస్తున్నారని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. బాపులపాడు మండలం కాకులపాడులోని పాల ఉత్పత్తిదారుల సహకార సొసైటీ సభ్యులకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి గానూ రెండో విడత బోనస్‌ను చలసాని చేతుల మీదగా సోమవారం పంపిణీ చేశారు. సొసైటీలోని 59 మంది సభ్యులకు రూ.1.10 లక్షల బోనస్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అత్యధిక పాల సేకరణ ధరను బోనస్‌తో కలిసి లీటరుకు రూ.88 చెల్లించటంతో పాటుగా పాడిరైతు కుటుంబాలకు పలు పథకాలు అందిస్తున్నామని చలసాని వివరించారు. హనుమాన్‌జంక్షన్ క్లస్టర్ మేనేజర్ కిలారి కిరణ్‌కుమార్, సూపర్‌వైజర్ బావిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

ఉంగుటూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అన్ని వర్గాల వారికి పూర్తి సమాచారం తెలియజేసేందుకే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. మండలంలోని కొయ్యగూరపాడు, లంకపల్లి గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఆయుష్మాన్ భారత్, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్, పీఎం పోషణ్ అభియాన్, హర్ ఘర్ జల్ జీవన్ మిషన్, జీవన్ జ్యోతి బీమాయోజన తదితర పథకాలను వివరించి అర్హతలను తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె.సుజాత, ఈవోఆర్‌డీ బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి

కంకిపాడు: గ్రామాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు చలివేంద్రపాలెం సర్పంచ్ బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి అన్నారు. మండలంలోని చలివేంద్రపాలెంలో రూ.10 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండా రామిరెడ్డి, స్థానిక నేతలు కొల్లి సుబ్బారెడ్డి, మరీదు శివశంకర్ పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి

నున్న(విజయవాడరూరల్): రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి ధ్యేయంగా పరిపాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు అవసరమని జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు అన్నారు. నున్న గ్రామంలో ఒకటో నంబరు సచివాలయంలో సోమవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం గ్రామ సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు,మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శీలం రంగారావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్‌వీఆర్ తదితరులు మాట్లాడారు. నున్న గ్రామానికి ప్రత్యక్షంగా 23కోట్ల 44లక్షల 96వేల 789 రూపాయలు, పరోక్షంగా 38 కోట్ల 65లక్షల 16వేల 306 రూపాయల లబ్ధి చేకూరిందని గ్రామ సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్ వివరించారు. మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, ఉప సర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ సాదం వెంకటేశ్వరావు, జూనపూడి కృష్ణ, గ్రామ కార్యదర్శి జీటీవీ రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. తొలుత సంక్షేమబోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.